# ఉత్తరం రాసిపెట్టాలంటే....

వీధిలో అరుగుమీద కుర్చీలో ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాను. ఆ వేళ ప్రొద్దుటే వేసవి సెలవలకు మావూరు వచ్చాను.

"చిన్నబాబూ! కొంచెం ఉత్తరం ముక్క రాసిపడేత్తారా."

ఒక్కసారిగా ఈ ప్రపంచంలో పడాను. ఎదురుగా చిన్నప్పుడు నన్ను ఎత్తుకొని మోసిన వెంకమ్మ నిలబడి ఉంది.

"ఏం ఇలావచ్చావేం" అన్నాను సరిగా వినిపించుకోనట్లు.

"కొంచెం ఉత్తరం ముక్క రాసిపడేత్తారని."

"ఎవరికి ?"

"ఇంకెవరికండీ ? ...... మా మగోడికి" సిగ్గుతో చెప్పినట్లు చెప్పింది

"ఏం. ఇక్కడలేడా ?" నా చిన్నప్పుడు మావూరిలోనే ఉండేవాడని జ్ఞాపకం.

"మీకు తెల్దేటి బాబూ! కంపునీపనట ఏదో. ఆడకుపోయినాడు."

"కార్డు తీసికొని వచ్చావా ?"

"ఆఁ. తెచ్చాను. మూడుకొన్నుర్డి."

"ఏదీ. యిలాగియ్." చెయ్యిచాపాను.

## కృష్ణశ్రీ

"రెండురోజుల్నించి చూస్తుంటే ఈ వేళ వచ్చేడు ఉత్తరాల బంట్రోతు" పడిన శ్రమ అంతా మాటల్లో చూపించింది.

కార్డుతీసికొని ఊరుపేరు రాసి తేదీ వేశాను.

"ఏం వ్రాయమంటావ్."

"నీ సంగతేమీ నాకు నచ్చలేదు" ఆమె కోపంగా అంది.

"నాసంగతి నీకు నచ్చకపోవట మేమిటే" నాకు భయంవేసింది దానిమాటలు ఎవరేనా విన్నారేమోనని. నేను ఆమె నేదో అన్నట్టు కూడా అనుమానపడవచ్చు.

"మీ సంగతికాదు బాబూ! మా మగోడిది" నాగుండె కుదటపడింది.

"ఏం ఎందుకు నచ్చలేదు ?"

"మా మొగుడు పెళ్ళాల గొడవ మీకెందుకండీ ? అలా రాయించండి."

"నేను ఉత్తరాలు రాసిపెట్టలేను. కర్ణంగారిలాంటివి బాగారాస్తాడు. ఆయనదగ్గరికి వెళ్ళు" విసుగ్గా అన్నాను.

"అలా అంటే ఎలాగండీ? ముందే ఆయనదగ్గరకు వెళ్ళాను."

"ఏమన్నాడూ."

"ఎత్తే నాకు కాలీలేదు పొమ్మన్నాడు."

"నీకు నీ మొగుడిసంగతి ఎందుకు నచ్చలేదో కొంచెం చెప్పు. లేకపోతే వాడికెలా తెలుస్తుంది నీకెందుకు నచ్చలేదో;"

"నాకు డబ్బుపంపకపోతే ఎలా బతుకుతాననుకున్నావ్ గంపెడు సంసారంతో. నీవు మనిషిజన్మ ఎత్తలేదూ ?" అరసని దంచేసింది.

ఏం వ్రాయాలో నాకు తెలియలేదు.

(47-వ పేజీ చూడండి)



భజగోవిందం.

భజగోవిందంయొక్క సమయ స్ఫూర్తికి మెచ్చి, విక్రమదేవుడు, "బ్రాహ్మణకోడేరు" గ్రామాన్ని, భజగోవిందానికి దానంచేశాడు. ★

# ఉత్తరం రాసిపెట్టాలంటే

(5-వ పేజీ తరువాయి)

"ఏం రాయలేం బాబూ! ఇంత సదువు కున్నారు గబగబా రాయలేరా."

నా మొఖం తెల్లబడింది.

"మళ్ళీ చెప్పమంటారా."

"వద్దులే. అంతా చెప్పేయ్. తరవాత రాస్తాను," మెల్లిగా అన్నాను.

"మీది మరీ యిదికొని ఈ కొంచెం రాయలేనోరు అంతా చెప్పాక ఎలా రాయ గలరు?" ఆమె ప్రశ్నించింది.

దీనికి సమాధానమివ్వటం నాతరం కాదను కున్నాను. ఉత్తరం రాయలేకపోయానని ఊళ్ళో చాటుతుందేమోనని భయంవేసింది. ఏదో రాస్తున్నట్లు నటించాను.

"పెద్దపిల్లకి నెలలు నిండాయ్. తీసుకు రాకపోతే ఎలాబాబూ,"

నేనేమీ మాట్లాడలేదు. నవ్వాపుకోలేక నవ్వాను.

"ఎలకకు ప్రాణసంకటం. పిల్లికి చెల గాటం" ఆమె ఖుస్సుమంది.

నేను రాస్తున్నట్లు సీరియస్‌గా ముఖం పెట్టి పెన్ను తిప్పి రాసేస్తున్నాను.

"చిన్నోడు నీకో సంబంధం కట్టు కొన్నాడు," వెంకమ్మ ముక్కు చీదింది.

"నీకెంతమంది పిల్లలు" తెలిసికొందామని అడిగాను.

"అది రాయనక్కరలేదు బాబూ! మాకు పిల్లలెంతమందున్నారో మావోడికి తెలుసు లెండి." ఆమె అమాయకంగా అందో, వెట కారంగా అందో నాకు తెలియలేదు.

"రాయటానికి కాదులే. అసలు ఎంత మంది పిల్లలు?"

"ముగురు ఆడోళ్ళు, ముగురు మగోళ్ళు బాబూ! పెద్దోళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు చేశానండి."

ఇంటిగొడవంతా చెబుతుందేమో ఖర్మ అనుకుని "ఉత్తరంలో రాసేదేచెప్పు" అన్నాను.

"ఇలాటికాపరం నేనెక్కడా చూళ్లేదు"

ఏదోరాస్తున్నట్లు నటిస్తున్నాను. ఆమె దృష్టి నామీద లేదు.

"నాచెల్లెల్ని దాని మొగుడు నెత్తిమీద పెట్టుకొని పూజిస్తాడు. నేనేం తప్పుపని చేశానని ఉత్తరం ముక్కకూడా రాయటం మానాడ్" నామీదమీద కొస్తుంది. నేనే దానిమొగుణ్ణి అన్నట్టు. దారివెంట పోయేవాళ్లు చూస్తున్నారని సిగ్గువేసింది. ఆమెనెలా వదిలించుకోవాలో తెలియలేదు.

"అక్కడ నీకెవత్తో పిల్లదొరికిందను కుంటున్నారు ఊళ్ళోఅందరూ" నవ్వుతూ అంది.

"ఇన్నేళ్ళువచ్చాక యిదేం వక్కబుద్ధి నీకు?"

"ఇది నిజమేనా?" అనుమానంతో అడిగాను.

"ఉత్తదిబాబూ! అలారాత్తే భయమేసి వెంటనే ఇంటికొత్తాడని."

ఆమెఆలోచనకు నాకాశ్చర్యం కలిగింది.

"కనక నీవుయిప్పుడు కంపునీపని మానేసి వెంటనే వచ్చేయవలసింది."

ఆమె ఆజ్ఞాపించింది. నాకునవ్వువచ్చింది. ఆమెకు కోపంవచ్చింది.

"నీవురాకపోతే నేను నుయ్యోగొయ్యో చూచుకుంటాను" ఆమె ఏడ్వటం మొదలు పెట్టింది.

"అంతపని చేయకు. వస్తాడులే" ఓదార్చాను.

దారినిపోయే యిద్దరు ఉత్తరం వ్రాయ టానికి నేనుపడేపాట్లు చూచి నవ్వుకుంటూ పోయారు. నాకు చచ్చినంత సిగ్గువేసింది.

"ఇంకా ఏమన్నారాయాలా?" దక్క త్వరగాపోవాలని దేవుడికి మ్రొక్కుకొన్నాను.

"ఉత్తరంముక్క రాయించమనిరాయండి అంతేచాలు."

ఆమె చెప్పినదంతా సమన్వయించుకొని ఉత్తరం వ్రాశాను.

నాకప్పటికే ముచ్చెమటలూ పోశాయ్. ఇంక ఎడ్రసురాయాలి.

"మీ ఆయన పేరేమిటి?"

"అయ్యో! నేనెలా చెప్పనండీ. మగోడి పేరు చెప్పకూడదని పెద్దయ్యగారు చెప్పారు."

"మరెలా! చెప్పకపోతే ఎవరికి అని రాయాలి."

"మీకు తెల్దా మా ఆయన పేరు"

"మరచిపోయాను. చిన్నప్పుడు విన్నా పేరు"

"అదిగో! ఆ వచ్చేవాడి పేరే!"

అలా ఒక అంబోతు వస్తుంది.

"అంబోతయ్యా"ఆశ్చర్యంగా అడిగాను.

"మీరు మరీను" ఆమె సిగ్గుపడింది.

"లేకపోతే వెంకన్నా" మా వూరిలో అంబోతుని వెంకన్న అంటారు.

"అవేనండి"

"ఏ వూరో ఏమిటో అంతా సరిగా చెప్పు. లేకపోతే ఈ మూడుకాన్లూదండుగ" హెచ్చరించాను.

"అది ఏ వూరమ్మా...గొంగూర ఊరు అంటారు..." ఆమె జ్ఞాపకంచేసికొంటుంది.

"గుంటూరా?"

"అవునండోయ్ గుంటూరే" వెంటనే చెప్పింది.

"ఏం పని చేస్తున్నాడు"

"నౌకరోడు"

"ఏ కంపెనీలో"

"అదేదో పుగాకు కంపునీ"

"పేరేమిటి"

"అదేదో నాకు తెల్దు"

"మరెలా. పోనీ మీ ఆయన నీకు ఎడ్రసు రాసిన ఉత్తరం ఉందా నీదగ్గర"

"ఇంటిదగ్గిరుంది బాబూ! ఇప్పుడే పరి గెత్తుకెళ్లి తెత్తాను ఉండండి."

అంతలో అలా వెంకమ్మ రెండవ కొడుకు వచ్చాడు.

"అమ్మా! ఇంతసేపే రాయించటం. నీవు వచ్చి గంటసేపు అయింది." వాడు విసుగ్గా అన్నాడు.

వాడిని ఉత్తరం తెమ్మని పంపింది వెంకమ్మ.

"ఎందుకు నీ మొగుడు అంతదూరం పోయాడు?" ఏమీ తోచక అడిగాను.

"ఇక్కడేం పనిదొరక్క అలా దేశాలు పట్టిపోయాడు బాబూ!"

"ఎన్నాళ్ళైంది?"

"మూడు నెల్లయింది."

ఉత్తరం తీసుకొని వెంకమ్మ కొడుకు వచ్చాడు. అందులో ప్రకారం ఎడ్రసు రాశాను.

"అంతా పూర్తిగా రాశారా బాబూ! నే చెప్పిందంతా."

"ఆ. రాసేను వెళ్ళు" ఉత్తరం ఇచ్చాను.

"కర్మంగాలైతే యింకా త్వరగా రాసేసే వారు. ఈయన ఎంత చదువుకున్నా ఉత్తరం వ్రాయటానికి గంటపట్టింది"పోతూ వెంకమ్మ కొడుకు గొణుక్కున్న మాటలు నా చెవిలో గింగురుమన్నాయ్.

కష్టపడి రాసినా పేరు దక్కలేదు.

నా స్థితి అంతా లోపల కిటికీలోంచి చూచి నవ్వాపుకోలేక నవ్వుతున్న మా శ్రీమతి నవ్వు చూచి ఏడ్వలేక నేనుకూడా నవ్వాను. ★